APTEL/25/A0055

# న్యూస్ నేడు

newsnedu.com

శనివారం, ఆగస్టు 29 2026

సంపుటి : 02 ● సంచిక : 150 ● పేజీలు : 8 ● వెల రూ.4/-

తెలుగు దిన పత్రిక

Simultaneously Published from Kurnool ANDHRA PRADESH & TELANGANA, VIJAYAWADA, SRI POTTI SRIRAMULU NELLORE, KRISHNA, CHITTOOR

# కన్నుల పండువగా తెప్పోత్సవం

- భక్తిశ్రద్ధలతో శాకోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు




**మంత్రాలయం న్యూస్ నేడు ; .** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి 355 వ సప్త రాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండో రోజు శ్రీ మఠంలో మఠం పీఠాధిపతిశ్రీ సుభుదేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెప్పోత్సవం కన్నుల పండుగగా జరిగింది. ఈ సందర్భంగా రెండో రోజు నిర్వహించే అత్యంత విశేషమైన పవిత్రమైన కార్యక్రమం శాకోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉంజల సేవమండపం దగ్గర, కూరగాయలు ఆకుకూరలు, పండ్లు వుంచి అత్యంత శోభాయమానంగా అలంకరణ చేశారు . మఠం

మిగతా 2వ పేజీలో..

# ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ డిజిటల్ ప్రాజెక్ట్

## విశాఖ కేంద్రంగా గూగుల్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్

**అమరావతి,ఆగస్ట్28 :** ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ డిజిటల్ ప్రాజెక్ట్ దక్కింది. ముంబై, చెన్నై తర్వాత దేశంలో మూడో అతిపెద్ద డిజిటల్ ల్యాండింగ్ హబ్‌గా ఏపీ అవతరించనుంది. సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్స్ నిర్మాణంలో గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు భాగస్వామ్యం కానున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా గూగుల్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌తో పాటు ఎఐ ఫెసిలిటీ అందుబాటులోకి రానుంది. మైక్రోసాఫ్ట్, లైట్‌స్టార్మ్, సింగ్‌టెల్ భాగస్వామ్యంతో సుమారు 3,600 కిలోమీటర్ల పొడవైన సముద్రగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేబుల్ ద్వారా




విశాఖపట్నానికి సింగపూర్, ఆగ్నేయాసియా ప్రాంతాలతో నేరుగా

మిగతా 2వ పేజీలో..

# 2047 నాటికి 50 శాతం పచ్చదనమే లక్ష్యం

- పర్యావరణ పరిరక్షణలో ప్రజలనూ భాగస్వాములను చేస్తాం
- మొక్కలు నాటడమే కాదు.. వాటి మనుగడకూ ప్రత్యేక దృష్టి
- అన్ని శాఖలనీ సమన్వయం చేసుకొని లక్ష్యాలను సాధిస్తాం
- ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ నాగబాబు



**మంగళగిరి, ఆగస్టు 28 :** ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా నాగబాబు బాధ్యతలు స్వీకరణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ..

మిగతా 2వ పేజీలో..

# రక్షణ రంగంలో మరో ముందడుగు

## అమెరికాతో రక్షణ శాఖ జావెలిన్ కొనుగోళ్లు

**న్యూఢిల్లీ,ఆగస్ట్28 :** భారత్ – అమెరికా రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. యుఎస్ నుంచి 'జావెలిన్' యాంటీ ట్యాంక్ క్షిపణుల కొనుగోలుకు ఇరు దేశాల అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు అమెరికా ఫారిన్ మిలిటరీ సేల్స్ పక్రియ ద్వారా లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్‌పై భారత అధికారులు సంతకం చేశారు. 'జావెలిన్' డీల్‌తో ఇరుదేశాల మధ్య సరికొత్త అధ్యాయం మొదలైందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. భారత్‌లో జావెలిన్ క్షిపణుల సంయుక్త ఉత్పత్తికి మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. క్షిపణులను ప్రయోగించిన తర్వాత మళ్లీ గైడ్ చేయక్కర్లేని 'ఫైర్ అండ్ పర్గెట్' ఆటోమేటిక్ టెక్నాలజీతో జావెలిన్ మిస్సైళ్లు పనిచేస్తాయని వివరించారు. శత్రు దేశాల ట్యాంకులు, బంకర్లకు చెక్ పెట్టేలా భయానక టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని చెప్పుకొచ్చారు. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో శత్రువుల

మిగతా 2వ పేజీలో..

## నియోజకవర్గాల విజన్ ప్లాన్ అమలు

# పనితీరుకు ప్రామాణికం

- విజన్ ప్లాన్ పై ప్రజా ప్రతినిధులు నిరంతరం సమీక్షించాలి
- ప్రజల భాగస్వామ్యం తోనే మెరుగైన ఫలితాలు
- నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి సమీక్ష



**అమరావతి, ఆగస్టు 28 :** రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచేందుకు నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించేందుకు నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. పేదరిక నిర్మూలన, ప్రజా సమస్యల త్వరిత పరిష్కారం, సుపరిపాలనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్ అమలుపై ప్రజా ప్రతినిధులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్సు లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీలు, ఎమ్మెల్యేలు, యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్టనర్స్ తో సీఎం మాట్లాడారు. నియోజక వర్గాల వారీగా విజన్ ప్లాన్ రూపొందించుకుని పని చేయడం దేశంలోనే ప్రథమంగా ఏపీలోనే అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. దీనికి జాతీయ స్థాయిలో మంచి పేరు వచ్చిందని చెప్పారు. ఈ క్రమంలో నియోజకవర్గాల విజన్ ను సమర్థవంతంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

### వినూత్నంగా ఆలోచించాలి... మెరుగైన సేవలు అందించాలి

ప్రస్తుత పరిస్థితుల్లో పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్య, వైద్యం భారంగా మారుతున్నాయని, ఈ ఇబ్బందుల నుంచి వారిని గట్టెక్కించేందుకే సంజీవని, తల్లికి వందనం వంటి వినూత్న పథకాలను తెచ్చామని సీఎం వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, నైపుణ్యాలు పెంచడం వల్ల అదనంగా లక్ష మంది విద్యార్థులు చేరారని, ఇది వారి కుటుంబాలపై విద్యా భారాన్ని తగ్గించిందని పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే అధికారులు, ప్రజా ప్రతినిధులు సాంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా విజన్ ప్లాన్‌ను వర్తింపజేస్తూ సమస్యలకు తగిన పరిష్కారాలు చూపాలని కోరారు. పరిపాలనలో ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయం అత్యంత కీలకమని, అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలు కావాలని స్పష్టం చేశారు. ఈ సమీక్షలో మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక, ప్రణాళిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, ఏపీఎస్ డిపీఎస్ ఈడీ వీఆర్ అలపర్తి సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# క్రెడిట్ చోరీ జగన్‌కే అలవాటు

- డీఎస్సీపై చర్చకు సిద్ధమన్నా జవాబేదీ
- మంత్రి లోకేశ్ మరోమారు విమర్శలు



**ఒంగోలు,ఆగస్ట్28 :** తాము చేసిన పనుల క్రెడిట్‌ను చోరీ చేసే వ్యక్తి జగన్ అని మంత్రి లోకేశ్ విమర్శించారు. వెలిగొండ ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయకుండా అప్పట్లోనే ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. ఒంగోలులో మంత్రి లోకేశ్ పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా వైకాపాపై విమర్శలు గుప్పించారు. డీఎస్సీపై చర్చించేందుకు ఎక్కడికైనా వస్తా.. సిద్ధమా? అని వైకాపా అధినేత జగన్‌కు మరోమారు సవాల్

విసిరారు. ఈ ఏడాది.. వచ్చే ఏడాది సైతం డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. వైకాపా హయాంలో చేసిన తప్పులకు కొందరు జైళ్లకు వెళుతున్నట్లు మంత్రి లోకేశ్ చెప్పారు. వైకాపా ప్రభుత్వ హయాంలో బీసీలను అనేక ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిపారు. తమ పార్టీ నేతలు, కార్యకర్తలపై దొంగ కేసులు పెట్టారన్నారు. కార్యకర్తలు తమను సంప్రదిస్తే దొంగ కేసులు ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఒంగోలులో పోతురాజు కాలువ బాగుచేసే బాధ్యత తీసుకుంటానన్నారు. దామచర్ల జనార్దన్ గెలిచాక ఒంగోలు రూపురేఖలు మారాయన్నారు. ఈ నగరంలో నీటి కొరత ఉందని.. అమృత్ ద్వారా సమస్య పరిష్కరించనున్నట్లు లోకేశ్ తెలిపారు.

# సోదరీమణులకు పవన్ కళ్యాణ్ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు



**మంగళగిరి,ఆగస్టు 28 :** అక్కాచెల్లెళ్లతో అన్నదమ్ములకున్న ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ (రాఖీ పౌర్ణమి) పర్వదినం సందర్భంగా సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. రాఖీ పౌర్ణమి భారతీయ కుటుంబ వ్యవస్థతో పెనవేసుకున్న బంధాలు, బాంధవ్యాలు, బాధ్యతలకు ఓ భావోద్వేగపూరిత సంకేతం. సోదర భావాన్ని, మహిళలకు గౌరవాన్ని, భరోసాని

మిగతా 2వ పేజీలో..

# నేపాల్ నుంచి 21మంది భారత్ చేరిక

## విదేశాంగశాఖ ప్రతినిధి జైశ్వాల్ వెల్లడి

**న్యూఢిల్లీ,ఆగస్ట్28 :** నేపాల్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల నుంచి 21 మంది భారతీయులు సురక్షితంగా దేశ రాజధాని ఢిల్లీ చేరుకున్నారని కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు. వీరంతా వారి స్వస్థలం తమిళనాడు చేరుకున్నారని వివరించారు. శుక్రవారం న్యూఢిల్లీలో ఆయన మాట్లాడుతూ.. నేపాల్‌లోని

మిగతా 2వ పేజీలో..

# మూడు దశాబ్దాల వెలుగొండ కల సాకారం

- అర్హులైన ప్రతి నిర్వాసితుడికీ పరిహారం
- రికార్డుల్లో లోపాలున్నా ఆందోళన అవసరం లేదు
- రూ.169 కోట్ల అదనపు భారమైనా ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేస్తాం
- జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు



**అమరావతి, ఆగస్టు 28 :** ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలనే మూడు దశాబ్దాల వెలుగొండ కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం విలువైన భూములు, ఆస్తులు, స్వగ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. 1996లో ముఖ్యమంత్రి చంద్రబాబు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 ఆగస్టు నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ముఖ్యమంత్రి నిర్దేశించారని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో వెలుగొండ ప్రాజెక్టు పనుల కోసం సుమారు రూ.2,250 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తూ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసిందని మంత్రి తెలిపారు.ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే

మిగతా 2వ పేజీలో..

# ముఖ్యమంత్రికి రాఖీలు కట్టిన మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు



**ఉండవలి, ఆగస్టు 28చట్టం న్యూస్ :** రాఖీ పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకి పలువురు మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు

మిగతా 2వ పేజీలో..

శనివారం,
ఆగస్టు 29 2026
న్యూస్ నేడు
newsnedu.com

# నిధులు కొరత ఉన్న సమస్య పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నాం

- మండల సర్వ సభ్య సమావేశం లో ఎమ్మెల్యే షాజహాన్ భాష
- ఎంపిటిసి జడ్పీటీసీ లకు వీడ్కోలు



**మదనపల్లె ఆగస్టు 28, న్యూస్ నేడు ప్రతినిధి :** మదనపల్లె మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఎం షాజహాన్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలం లో త్రాగునీటి సమస్య, సిమెంట్ రోడ్ల నిర్మాణం, వ్యవసాయ, ఉద్యానవన శాఖల పైన సమిక్షించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి దాదాపు 45 కోట్ల రూపాయలతో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేయడం జరిగిందని, డిఎంఎఫ్ నిధులతో లింక్ రోడ్లని దాదాపు 10 కోట్లతో వేయడం జరిగింద న్నారు. మదనపల్లె - రామసముద్రం, మదనపల్లె - నిమనపల్లి రోడ్లు కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటికి దయనీయస్థితిలో ఉండేవని, ఆ రోడ్లని బాగు చేయడంతో నేడు అందరూ ప్రశాంతం గా ప్రయాణాల్ని సాగిస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఎక్కడ సమస్య వున్నా అక్కడ తప్పక నేను ఉంటానని ముందుండి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. నిధుల సమస్య వెంటాడుతున్న ఏదో ఒక రకంగా ప్రతి సమస్యని తీర్చుతున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం అధికారం లో ఉన్న ఎంపీటీసీ, జడ్పిటిసి లకు ఇదే చివరి సమావేశం కావడంతో వారిని ఎమ్మెల్యే ఐదు సంవత్సరాలు ఓపికగా ప్రజలకు సేవలు అందించి నందుకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం రాఖీ పండుగ సందర్భంగా సమావేశానికి హాజరైన మహిళలు ఎమ్మెల్యే కి రాఖీని కట్టి సత్కరించారు.
అలాగే ముఖ్య మంత్రి పేదరిక నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలు పి ఫోర్ గురించి జరిగిన వీడియో కాన్ఫరెన్స్ లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

# పీట్ల అంజలికి బిజెపి లో కీలక బాధ్యతలు

**ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియామకం**



**మదనపల్లె ఆగస్టు 28, న్యూస్ నేడు ప్రతినిధి :** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా అన్నమయ్య జిల్లా, మదనపల్లె పట్టణానికి చెందిన పీట్ల అంజలి నియ మితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శుక్రవారం అన్నమయ్య జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు పులి నరేంద్ర కుమార్ రెడ్డిని పీట్ల అంజలి మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పీట్ల అంజలి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ ఎస్సీ మోర్చా రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధిగా తనను ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్, రాష్ట్ర సంఘటన మంత్రి మధుకర్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు పనతల సురేష్, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పులి నరేంద్ర కుమార్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.బసవరాజు, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నిమ్మనపల్లి పురుషోత్తం, బిజెపి నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయనని తనకు అప్పగించిన బాధ్యతలను సమర్ధ వంతంగా నిర్వర్తించి, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఎస్సీ విభాగాన్ని బలోపేతం చేసి, ఏపీలో భాజపాను అధికారంలోకి తీసుకొస్తామని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

# 4న గోకులాష్టమి వేడుకలు



**జూపాడు బంగ్లా, న్యూస్ నేడు :** గోకులాష్టమిని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4న జూపాడు బంగ్లా మండలం, పారుమంచాల గ్రామంలోని శ్రీ వేణుగోపాల స్వామి దేవస్థానం నందు గోపూజ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్యానర్ ను స్థానిక భక్త సమాజంతో కలిసి ఆవిష్కరించారు. గోవు యొక్క విశిష్టత, గో సంరక్షణ ఆవశ్యకత తెలుపుటకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక అర్చకులు సునీలాచార్యులు, స్థానిక ఆలయాల నిర్వాహకులు పోచ లోకేశ్వర రెడ్డి, భజన మండలి అధ్యక్షులు మండ్ల రాము, భజనమండలి సభ్యులు నారాయణరెడ్డి, జనార్దన్ రెడ్డి, దివాకరరెడ్డి వెంకటస్వామి, పాపయ్యాచారి, మధు, శివ, మద్దిలేటి, చెన్నప్ప, పుల్లయ్య, ప్రవీణ్, ఆంజనేయులు, మధు కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# ' జై జవాన్ వెల్ఫేర్ ' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**గోనెగండ్ల, న్యూస్ నేడు :** మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జై జవాన్ వెల్ఫేర్ అసోసియేషన్, కర్నూలు ఆధ్వర్యంలో గోనెగండ్లలో శనివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. నిరుపేదలు, చిన్నారులు, అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి ఉపయోగపడేలా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గోనెగండ్లతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, యువత, క్రీడాభిమానులు, రక్తదానం చేయడానికి ఆసక్తి ఉన్నవారు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

# పేదరిక నిర్మూలనే లక్ష్యం

- ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆర్థికంగా బలో పేతం చేయాలి
- జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ



**మదనపల్లె ఆగస్టు 28, న్యూస్ నేడు ప్రతినిధి :** విజన్ యాక్షన్ యూనిట్లు, జీరో పావర్టీ--పీ4 (పబ్లిక్--ప్రైవేట్--పీపుల్--పార్ట్నర్‌షిప్) కార్యక్రమాల ద్వారా పేదరిక నిర్మూలనకు చేపడుతున్న చర్య లపై రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్ర వారం విజయవాడ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.
ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాయచోటి నుంచి రాష్ట్ర యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి పాల్గొనగా, మదనపల్లె కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి పాల్గొన్నారు.
జిల్లాలో విజన్ యాక్షన్ యూనిట్ల పనితీరు, జీరో పావర్టీ--పీ4 కార్య క్రమాల పురోగతి, అమలు తీరు, నిరుపేద కుటుంబాల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు చేపడుతున్న చర్యలను ముఖ్య మంత్రి సమీ క్షించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధికారులతో సమీక్షిస్తూ, పీ4 కార్యక్రమం ద్వారా అర్హులైన నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ వనరులు, ఉపాధి అవకాశాలను సమన్వయం చేసి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే దిశగా కార్యాచరణ ఉండాలని, శాఖల మధ్య సమన్వయం తో పీ4 లక్ష్యాలను సాధించాలని ఆదేశించారు.
రాయచోటి నుంచి సీఎం నారా చంద్రబాబు నాయుడికి పీ4, విజన్ యాక్షన్ ప్లాన్‌పై వివరాలు
సీఎం నారా చంద్రబాబు నాయుడు విజన్‌ను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసేందుకు ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా, రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో యంగ్ ప్రొఫెషనల్ పి. ఉమామహేశ్వర్ రావు వర్చువల్ సమావేశంలో పాల్గొని రాయచోటి నియోజకవర్గంలో పి4, పీజీఆర్ఎస్, కేపీఐ కార్యక్రమాల పురోగతిని ముఖ్య మంత్రికి వివరించారు.
నియోజకవర్గంలోని 46 ఫ్లోరైడ్ ప్రభావిత గ్రామాల్లో తొలి దశగా 20 గ్రామాల్లో సి ఎస్ ఆర్ నిధుల తో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను గుర్తించి సత్వర పరిష్కారం చూపడంతో పాటు, అభివృద్ధి కార్య క్రమాలను నిర్దేశిత లక్ష్యాల మేరకు ఫలితాల దిశగా తీసుకెళ్తున్నట్లు వివరించారు.
ఈ కార్యక్రమంలో సీపీఓ వెంకట పెద్దయ్య, డ్వామా పీడీ నాగేశ్వరరావు, డీఐఓ కృష్ణకుమార్, మదనపల్లె మునిసిపల్ కమిషనర్ ప్రమీల, జిల్లా, మండల స్థాయి సంబంధిత అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికా రులు, యంగ్ ప్రొఫెషనల్స్, విజన్ స్టాఫ్ యూనిట్ సభ్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా గురజాల అనిరుధ్ జన్మదిన వేడుకలు

- హాజరైన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్
- తరలివచ్చిన అతిరథ మహా రధులు



**మదనపల్లె ఆగస్టు 28, న్యూస్ నేడు ప్రతినిధి :** చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ సోదరుడు గురజాల జీవన్ కుమారుడు గురజాల అనిరుధ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ప్రముఖ శక్తిక్షేత్రమైన శ్రీ బోయకొండలో పండుగ వాతావరణంలో జరిగాయి. ఈ వేడులకు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ముఖ్య అతిథిగా హాజరు కాగా బంధు మిత్రులు, శ్రేయోభిలాషులు, కూటమి నేతలు, కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. ఇందులో భాగంగా కట్ చేసి అనిరుధ్ కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాల్లో గురజాల కుటుంబానిది ప్రత్యేక స్థాన మన్నారు. ప్రజలకు నిరంతరం అందు బాటులో ఉండి వారి సమస్యలను పరిష్క రించడంలో గురజాల కుటుంబం ముందుంటుందన్నారు. ప్రస్తుత చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో సుపరి పాలన అందిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారని కొనియాడారు. అనిరుధ్ ఉన్నత విద్యలను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించి గురజాల కుటుంబ కీర్తి ప్రతిష్టలు పెంచాలని ఆకాంక్షించారు. అనంతరం గురజాల జీవన్ మాట్లాడుతూ శక్తి స్వరూపిణి, కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ బోయకొండ గంగమ్మ తల్లి సన్నిధానంలో తన కుమారుడి పుట్టినరోజు వేడుకలు జరుపు కోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మా ఆహ్వానం మేరకు నా కుమారుడు అనిరుధ్ పుట్టిన రోజు వేడుకలకు విచ్చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి మా కుటుంబం తరఫున పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్య క్రమంలో తెలుగుదేశం సీనియర్ నాయకులు సీడ్ మల్లికార్జున నాయుడు, రన్ టివి సిఈఓ సిరివేలు చరణ్ నాయుడు, పాత్రికేయులు పాల్గొన్నారు.

# సులువాయి, ముద్దటమాగి పాఠశాలల్లో మండల విద్యాశాఖ అధికారి--2 పి. కబీర్ సాబ్ తనిఖీలు

- మధ్యాహ్న భోజన పథకం నాణ్యతపై ప్రత్యేక దృష్టి
- ఎస్ఎల్ఏఎస్ పరీక్ష నిర్వహణ పరిశీలన
- విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి:
- మండల విద్యాశాఖ అధికారి--2 పి. కబీర్ సాబ్





**హోళగుంద న్యూస్ నేడు:** హోళగుంద మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాశాఖ అధికారి--2 పి. కబీర్ సాబ్ సందర్శించి పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల సులువాయి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సులువాయి, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ముద్దటమాగి పాఠశాలలను సందర్శించి అక్కడి విద్యా, పరిపాలనా కార్యకలాపాలను సమగ్రంగా తనిఖీ చేశారు.
ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును మండల విద్యాశాఖ అధికారి--2 పి. కబీర్ సాబ్ పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, వంటశాల పరిశుభ్రత, భోజనం తయారీ విధానం, విద్యార్థులకు భోజనం అందించే తీరును పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పౌష్టికాహారంతో కూడిన భోజనం విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.
పాఠశాలల నిర్వహణలో ఏవైనా సమస్యలు ఎదురైతే వాటిని గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకునే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, పాఠశాలల సమర్థ నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని మండల విద్యాశాఖ అధికారి--2 పి. కబీర్ సాబ్ స్పష్టం చేశారు. ఈ తనిఖీల ద్వారా పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడం, ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించడం లక్ష్యంగా అధికారుల పర్యవేక్షణ కొనసాగుతోందని తెలిపారు.

# కోట్ల నాయకత్వంపై విశ్వాసంతో టీడీపీలోకి 30 కుటుంబాల చేరిక





**ప్యాపిలి న్యూస్ నేడు:** డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి నాయకత్వంపై విశ్వాసంతో వివిధ పార్టీలకు చెందిన కుటుంబాలు టీడీపీలో చేరుతున్నాయని పార్టీ నాయకులు తెలిపారు.
డోన్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్యాపిలి మండలానికి చెందిన పలువురు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ప్యాపిలి మండలం కలచట్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ సరస్వతమ్మ, జయరామయ్యలతో పాటు సుమారు 25 కుటుంబాలు, అలాగే పెద్దపుజర్ల గ్రామానికి చెందిన 5 కుటుంబాలు వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరాయి.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు డోన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పట్ల ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అందుకే పెద్ద ఎత్తున ప్రజలు టీడీపీలో చేరుతున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత వేగవంతంగా ముందుకు తీసుకెళ్తామని ఎమ్మెల్యే తెలిపారు. కోట్ల కుటుంబం నాయకత్వంలో డోన్ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరింత బలోపేతం అవుతోందని, రానున్న రోజుల్లో మరిన్ని కుటుంబాలు పార్టీలో చేరే అవకాశం ఉందని పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డోన్ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజా నారాయణమూర్తి, టిడిపి నాయకులు బత్తుల రామేష్ రెడ్డి, కమతం భాస్కర్ రెడ్డి, గడ్డం అంకి రెడ్డి, చల్లా అనుదిప్ కుమార్ ,కలచట్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఏఐ'తో.. భవిష్యత్ ...







- విద్యార్థులు ఆ దిశగా కృషి చేయాలి
- డా. ఇ.ఎస్. చక్రవర్తి

**కర్నూలు ఎడ్యుకేషన్ , న్యూస్ నేడు:** నగరంలోని రవీంద్ర ఇంజనీరింగ్ మహిళా కళాశాల మరియు జి. పులయ్య ఇంజనీరింగ్ కళాశాలలో సంయుక్తంగా మొదటి సంవత్సరం బి.టెక్ 2026లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఓరియంటేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డాక్టర్ ఈ.ఎస్ చక్రవర్తి, వైస్ ప్రెసిడెంట్, ఆమ్డాక్స్ విచ్చేశారు. ఈ సందర్భంగా డా. ఇ.ఎస్. చక్రవర్తి మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్ సాంకేతికతపై దిశానిర్దేశం చేశారు. 2030 నాటికి యంత్రాలు అత్యంత తెలివైనవిగా మారబోతున్నాయి. AI ఆధారిత యంత్రం ఇకపై కేవలం ఒక పరికరం కాదు. అది మన జీవితంలో ఒక నిత్య సహచరుడు, ఒక తోడుగా మారబోతోంది. మనుషుల కంటే తెలివైన యంత్రాలను తయారు చేయడమే మొదటి సంవత్సరం బి.టెక్ విద్యార్థులకు ముందున్న లక్ష్యం" అని ఆయన అన్నారు. అనంతరం రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కోసమే మేము అత్యాధునిక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాము. విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి. ఆ తరువాత రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ జి.వి.ఎం. మోహన్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం ీూ× యుగం నడుస్తోంద ని, భవిష్యత్తు క్వాంటం కంప్యూటింగ్ది కూడా అవ్వచ్చన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దేశంలోనే మొదటగా క్వాంటం హబ్ ప్రారంభించడం గర్వకారణమని, త్వరలో ఇతర రాష్ట్రాలు అనుసరిస్తాయని, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులు, తల్లిదండ్రులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్ని టెక్నాలజీలు వచ్చిన విద్యార్థులు ఏ బ్రాంచు తీసుకున్నప్పటికీ క్రమశిక్షణతో చదివితే అవకాశాలకు కొదవలేదు అని తెలియజేశారు.

# కర్నూలు ఎంపీని మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ సీనియర్ నాయకులు

**పలు స్థానిక అంశాలపై ఎంపీతో చర్చించిన నాయకులు**



**హోళగుంద న్యూస్ నేడు:** కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ ఎంపీని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బుడగజంగాల రామాంజీ నేతృత్వంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీకి శుభాకాంక్షలు తెలియజేసి, పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

ఎంపీ నివాసంలో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు నియోజకవర్గంలోని ప్రస్తుత పరిస్థితులు, స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలు, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా ఎంపీ కూడా నాయకులతో ఆత్మీయంగా మాట్లాడి స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గోవిందు, గజ్జలప్ప, ఆదెప్ప తదితరులు పాల్గొన్నారు. నాయకుల మర్యాదపూర్వక భేటీ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు అంశాలతో పాటు స్థానిక అభివృద్ధి, ప్రజా సమస్యలపై విస్తృతంగా చర్చ జరిగినట్లు తెలిపారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి రెండు రోజుల జైలు




**ప్యాపిలి, న్యూస్ నేడు:-** మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ప్యాపిలి మండలం రామరత్నగిరి గ్రామానికి చెందిన రాచిపోగుల దేవేంద్ర (32)కు డోన్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ప్యాపిలి ఎస్సై నాగార్జున తెలిపారు.

ప్యాపిలి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ కేసులపై విచారణ అనంతరం కోర్టు తీర్పు వెలువడిందని ఎస్సై తెలిపారు. ఒక డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో రెండు రోజుల జైలు శిక్ష విధించగా, మరో ఐదు ఓపెన్ డ్రింకింగ్ కేసుల్లో నిందితులకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఈ కేసుల్లో శిక్షలు పడిన వారంతా ప్యాపిలి మండలానికి చెందినవారేనని తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్సై నాగార్జున మాట్లాడుతూ.. హైవేలపై ప్రయాణించే వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఫోర్ వీలర్, టూ వీలర్ వాహనదారులు అప్రమత్తంగా ఉండి రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు.

ఆగస్టులో 15 కేసులు.. రూ.37,500 జరిమానా

ఆగస్టు నెలలో ఇప్పటివరకు 15 సెక్షన్ 125 బీఎన్ఎస్ కేసులు నమోదు చేసి, వాటికి సంబంధించి రూ.37,500 జరిమానా వసూలు చేసినట్లు ఎస్సై నాగార్జున తెలిపారు. అదేవిధంగా 250 ఈ-చలాన్ కేసులు నమోదు చేసి రూ.46,250 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలకు కారణం కావద్దని, ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరిస్తూ రోడ్డు భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై నాగార్జున కోరారు.

---------

# అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

**ఎల్లార్తి గ్రామంలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు**



**హోళగుంద న్యూస్ నేడు:** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎల్లార్తి గ్రామంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.కె. గిరికి ఆయన అక్క రాజేశ్వరి రాఖీ కట్టి ఆత్మీయంగా రక్షాబంధన్ వేడుకలను నిర్వహించారు.

ఈ సందర్భంగా యస్.కె. గిరి మాట్లాడుతూ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. అక్కకు తమ్ముడు, చెల్లికి అన్న ఎల్లప్పుడూ తోడుగా ఉంటారని, జీవితంలో ఎదురయ్యే ప్రతి కష్టంలో చేదోడువాదోడుగా నిలుస్తారని తెలిపారు. ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలకు రాఖీ పండుగ ప్రతీక అని పేర్కొన్నారు.

అక్క రాజేశ్వరి తనకు రాఖీ కట్టి అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ఆప్యాయతను మరింత చాటిచెప్పారని, ఈ రక్షాబంధన్ వేడుక తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని యస్.కె. గిరి తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు ఒకరికొకరు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

# శ్రీ వీరభద్రేశ్వర స్వామి ప్రత్యేక పూజలకు ఈబీజీ గోవింద్ గౌడ్‌కు ఆహ్వానం

**మర్యాదపూర్వకంగా ఆహ్వానించిన పెద్దహ్యాట గ్రామస్తులు, ఆలయ అర్చకులు**



**హోళగుంద న్యూస్ నేడు:** పెద్దహ్యాట గ్రామంలో ఈ నెల 31వ తేదీన శ్రీ వీరభద్రేశ్వర స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న సందర్భంగా, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఈబీజీ గోవింద్ గౌడ్‌ను పెద్దహ్యాట గ్రామస్తులు, ఆలయ అర్చకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా శ్రీ వీరభద్రేశ్వర స్వామి ఆలయ అర్చకులు పంపయ స్వామి, మలయ్య, వీరేష్, రాము, తిరుపతి, బసవ, రామ తదితరులు ఈబీజీ గోవింద్ గౌడ్‌ను కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమానికి తప్పక హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

గ్రామస్తులు, ఆలయ అర్చకులు అందించిన ఆత్మీయ ఆహ్వానాన్ని ఈబీజీ గోవింద్ గౌడ్ సంతోషంగా స్వీకరించారు. గ్రామ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సంప్రదాయాలకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. గ్రామంలో నిర్వహించే దేవాలయ పూజా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఈ నెల 31న నిర్వహించే శ్రీ వీరభద్రేశ్వర స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమానికి తప్పక హాజరవుతానని హామీ ఇచ్చారు.

శ్రీ వీరభద్రేశ్వర స్వామివారి కృపాకటాక్షాలతో పెద్దహ్యాట గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఈబీజీ గోవింద్ గౌడ్ ఆకాంక్షించారు.

# సొసైటీ మేనేజర్ రత్నమ్మకు ఘన సత్కారం



**నందికొట్కూరు న్యూస్ నేడు:** నంద్యాల జిల్లా నందికొట్కూరు పట్టణంలోని సహకార సొసైటీ బ్యాంక్ లో ప్రాసెసింగ్ మేనేజర్ రత్నమ్మ బదిలీ అయిన సందర్భంగా సొసైటీ కార్యాలయంలో శుక్రవారం ఆమెను ఘనంగా సన్మానించారు.ఈమే గత మూడు సంవత్సరాల నుండి కార్యాలయంలో పనిచేశారని బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించినందుకు గాను బ్యాంకు జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిందని బ్రాంచ్ మేనేజర్ కె.వి.రమణ మరియు సిబ్బంది అన్నారు. ప్రాసెసింగ్ మేనేజర్ రత్నమ్మ సేవలను సిబ్బంది కొనియాడారు.మేనేజర్లు శంకర్,శివకుమార్ సిబ్బంది భారతి,మహేశ్వర్ రెడ్డి, సోహెల్,సీఈవోలు,ఖాజా మొహిద్దీన్,అశోక్ కుమార్ శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది శ్యాంప్రసాద్,శివన్న, మల్లికార్జున,జయరాం, నరేంద్ర కుమార్ మరియు డైలీ డిపాజిట్ ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు సంకల్ప్--2026 స్టడీ మెటీరియల్ పంపిణీ





**ప్యాపిలి, న్యూస్ నేడు:** ప్యాపిలి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచే లక్ష్యంతో ఇంటర్మీడియట్ బోర్డు ప్రవేశపెట్టిన సంకల్ప్--2026 ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం విద్యార్థులకు పంపిణీ చేశారు.

కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కామర్స్, ఎకనామిక్స్, సివిక్స్, హిస్టరీ తదితర అన్ని సబ్జెక్టులకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు అందజేశారు.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇప్పటికే విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ పంపిణీ చేసిందన్నారు. ఇంటర్ విద్యార్థులకు చదువు సులభతరం అయ్యేలా ముఖ్యమైన ప్రశ్నలు, వాటికి సులభతరమైన సమాధానాలతో సంకల్ప్--2026 స్టడీ మెటీరియల్‌ను రూపొందించారని తెలిపారు. విద్యార్థులు ఈ మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదివి మంచి ఫలితాలు సాధించాలని, ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నవీన పాటి, ఓబులేసు, వెంకటరమణ, మద్దిలేటి, ముస్తాక్, శంకరయ్య, మురళీమోహన్ గౌడ్, సురేష్, వన్నూర్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

-------

# నేపాల్ వరదల్లో ఆచూకీ లేని ప్రవాస ఆంధ్రులు

## ఆందోళనలో వారి కుటుంబ సభ్యులు

న్యూఢిల్లీ,ఆగస్ట్28 : నేపాల్‌లో జరిగిన జలప్రళయంలో ఇరుక్కుపోయిన, గల్లంతైన వారిలో తెలుగు ప్రవాసీయుల కోసం వారి కుటుంబాలు ఆందోళనగా చూస్తున్నాయి. తమ వారి ఆచూకీ చెప్పాలని రాయబార కార్యాలయాలకు ఫోన్లు చేస్తున్నారు. నేపాల్- టిబెట్ సరిహద్దులో వీరి సెల్ ఫోన్లు కూడా పని

చేయకపోవడంతో ప్రవాసీయుల బంధుమిత్రులు ఆందోళన చెందుతున్నారు. ఖతర్‌లో పని చేసే సి. రమేశ్ బాబు జలప్రళయానికి కొన్ని గంటల ముందు చైనా-నేపాల్ సరిహద్దులోని రసువాలో చైనా వైపు ఇమ్మిగ్రేషన్ కార్యాలయం వద్ద కనిపించారు. ఆ తర్వాత ఆయన జాడ తెలియకపోవడంతో ఖతర్‌లోని బంధుమిత్రులతో పాటు స్వస్థలమైన కృష్ణా జిల్లాలో ఆయన కుటుంబం ఆందోళన చెందుతోంది.

దుబాయిలో నివాసముండే మూడు తెలుగు కుటుంబాలకు చెందిన ఐదుగురు ప్రవాసీయులు కైలాస మానస సరోవర పరిక్రమ యాత్ర ముగించుకుని తిరిగి వస్తుండగా వరదల కారణంగా వారి ప్రయాణానికి తాత్కాలిక అడ్డంకి ఏర్పడింది. గత మూడు రోజులుగా వరద కారణాన చైనా భూభాగం వైపు రాకపోకలు ఆగిపోవడంతో పాటు సెల్ ఫోన్ సంబంధాలు కూడా తెగిపోయి దుబాయిలోని వారి కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందాయి. అదృష్టవశాత్తూ శుక్రవారం టిబెట్ నుండి వీరు సురక్షితంగా నేపాల్‌కు చేరుకోవడంతో కుటుంబసభ్యుల మానసిక క్షోభకు తెరపడింది. 5 వేల అడుగుల ఎత్తున మానస సరోవర పర్వత ప్రాంతంలో వీరి సెల్ ఫోన్లు పని చేయకపోవడంతో అప్పుడప్పుడు వీరు వాట్సప్ మీద పంపుతున్న సందేశాల కోసం కుటుంబాలు ఎదురు చేశాయి. తాము చేరుకునే సమయానికి రుసువా చెక్ పోస్ట్ వరదలలో కొట్టుకుపోయిందని ఈ బృందంలోని గుంటూరు జిల్లాకు చెందిన సౌజన్య రెడ్డి దుబాయిలోని తన బంధుమిత్రులకు సమాచారమందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మొత్తం 10 మంది ప్రవాసీయుల ఆచూకీ తెలియడం లేదని తెలుస్తోంది. వీరిలో కొందరు అమెరికాలో స్థిరపడిన వారని తెలిసింది. మంగళగిరిలోని ఏపీ ఎన్నార్టీఎస్ సంస్థ అధికారులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో వీరి యోగక్షేమ సమాచారాల గురించి రేయింబవళ్ళు విచారిస్తున్నారు. తెలంగాణకు చెందిన మొత్తం 23 మంది ప్రవాసీయులు యాత్రకు వెళ్లగా అందులో అత్యధికులు అమెరికాకు చెందిన వారే ఉన్నారు. దుబాయిలోని రెండు తెలంగాణ కుటుంబాలు కూడా యాత్రకు వెళ్లగా వారు క్షేమంగా ఉన్నట్లుగా సమాచారం.


## జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ లోతేటి శివశంకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి



**ఏలూరుజిల్లా ప్రతినిధి,న్యూస్ నేడు:** జిల్లా కలెక్టరేటు గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం ఒక్కరోజు కార్యక్రమానికి జిల్లాకు వచ్చిన జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ శ్రీ లోతేటి శివశంకర్ ను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పూలమొక్కను అందజేశారు. జిల్లా కలెక్టరుతో పాటు అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, నూజివీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్నలు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి యం.శ్రీదేవి, ఆర్డీవో లు కె.లక్ష్మీప్రసన్న, యం.వి.రమణ, ఆర్వోలు, ఏఇఆర్వోలు, జిల్లాకు చెందిన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఘనంగా బిషప్ డా.జయరావు జన్మదిన వేడుకలు

- పెరికె ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్
- వృద్ధులకు దుస్తులు పంపిణీ



**ఏలూరు జిల్లా ప్రతినిధి,న్యూస్ నేడు:** ఏలూరు కతోలిక్ ఎస్సీ బీసీ కమిషన్ నేషనల్ చైర్మన్ బిషప్ మోస్ట్ రెవర్ అండ్ డాక్టర్ జయరావు పొలిమేర పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు పెరికె వరప్రసాదరావు తెలిపారు. ఆయన జన్మదినోత్సవం సందర్భంగా స్థానిక తంగెళ్ళమూడి లంకపేట ఐసిఎం స్కూల్ నందు డెంటల్ మెడికల్ క్యాంపు , వృద్ధులకు నూతన వస్త్రాలు డిస్ట్రిబ్యూషన్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజీ డాక్టర్స్ పాల్గొని ఐసిఎం స్కూల్ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం బ్రష్ పేస్ట్, సోప్స్, స్కూల్ కిట్స్ లు ఉచితంగా ఇవ్వడం జరిగిందని తెలిపారు.

## ప్యాపిలిలో ఘనంగా రాఖీ ఉత్సవం, హయగ్రీవ జయంతి వేడుకలు



**ప్యాపిలి, న్యూస్ నేడు:** ప్యాపిలి పట్టణంలోని శ్రీ సరస్వతి శిశు మందిరంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా రాఖీ ఉత్సవం, హయగ్రీవ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల కార్యదర్శి బీసీ విజయ్ కుమార్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా సీనియర్ ఆచార్యులు వాసు హయగ్రీవ జయంతి విశిష్టతతో పాటు రాఖీ పౌర్ణమి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం "నీవు నాకు రక్ష.. నేను నీకు రక్ష.. మనిద్దరం దేశానికి రక్ష" అనే సందేశంతో విద్యార్థులు శ్లోకాలు చదువుతూ రాఖీలు కట్టుకున్నారు.

అనంతరం ప్యాపిలిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, వివిధ బ్యాంకులకు వెళ్లి రాఖీలు కట్టారు. రాఖీ పండుగ ద్వారా సోదరభావం, దేశభక్తి, పరస్పర రక్షణ భావనలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు.


ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు కే. పార్వతి, ఆచార్య బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



# అన్నాచెల్లెళ్లు,అక్కాతమ్ముళ్ల ప్రేమానురాగాల ప్రతీకగా రక్షాబంధన్

**టీడీపీ జిల్లా అధ్యక్షులు,ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి**


**ఏలూరు జిల్లా ప్రతినిధి,న్యూస్ నేడు:** అన్నాచెల్లెళు,,అక్కాతమ్ముళ్ల మధ్యనున్న ప్రేమానురాగాలు, బాధ్యత, రక్షణకు ప్రతీకగా రక్షాబంధన్ పండుగను జరుపుకుంటారని టీడీపీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి వెల్లడించారు. గతంలో తాను ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జిగా బాధ్యతలు స్వీకరించి పాదయాత్ర ప్రారంభించిన నాటి నుండి అనేక మంది అక్కచెల్లెమ్మలు తనకు చేదోడు వాదోడుగా నిలుస్తూ వచ్చారని పేర్కొన్న ఆయన,,, వారితో తనకున్న అనుబంధం ఇదేవిధంగా కలకాలం నిలిచిపోతుం దంటూ సంతోషం వ్యక్తం చేశారు. శుక్రవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా ఏలూరు పవర్‌పేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం సందడిగా మారింది. టీడీపీ మహిళా నేతలు, వివిధ డివిజన్‌ల నుండి తరలివచ్చిన మహిళామణులతో కిక్కిరిసిపోయింది. వారంతా ఎమ్మెల్యే బడేటి చంటికి రాఖీలు కట్టారు. హారతులిచ్చారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే చంటి,,, వారికి ఆశీస్సులు అందజేశారు. అలాగే కానుకలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ తనకు వెన్నుదన్నుగా నిలిచిన అక్కచెల్లెమ్మలను ఏనాటికి మరువనని స్పష్టం చేశారు. కుటుంబాలు అభివృద్ధి చెందేందుకు ఆడపడుచుల ఆశీస్సులు ఎంతో అవసరమని ఆయన వ్యాఖ్యానించారు. ఈ బంధం ఇదేవిధంగా జీవితాంతం నిలిచిపోతుందని పేర్కొన్న ఎమ్మెల్యే బడేటి చంటి,,, అవసరమైన వేళల్లో అక్కచెల్లెమ్మలందరికీ అండదండగా నిలుస్తానని భరోసా కల్పించారు. అలాగే ఏఎంసి చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథికి కూడా మహిళలు రాఖీలు కట్టారు.



# వర్షాకాలంలో కలుషితమైన నీరు త్రాగడం,వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్లే టైఫాయిడ్ జ్వరాలు

- అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించన
- గవరవరంలో సీజనల్ వ్యాధులపై ఫ్రైడే డ్రై డే కార్యక్రమం

**ఏలూరుజిల్లా ప్రతినిధి,న్యూస్ నేడు :** వర్షాకాలంలో సంభవించే జ్వరాలన్నీ దోమ కుట్టడం వల్ల వచ్చే జ్వరాలు కాదని వర్షాకాలంలో ప్రజలు ఎక్కువగా టైఫాయిడ్ జ్వరాలతో బాధపడతారని దీనికి కారణము కలుషితమైన నీరు త్రాగడం వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వలన టైఫాయిడ్ మరియు ఇతర వైరల్ ఫీవర్ సంభవిస్తాయని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏలూరు గవరవరం మన్నే మన్నే వెంకటేశ్వరరావు కాలనీ అక్కడ ప్రజలతో మాట్లాడుతూ వర్షాకాలంలో సాధారణంగా జ్వరాలు, వాంతులు,విరోచనాలు కామెర్లు,టైఫాయిడ్ మొదలు అంటువ్యాధులతో ప్రజలు బాధపడతారని కొన్ని జ్వరాలు దోమ కుట్టడం వల్ల సంక్రమిస్తాయని కొన్ని జ్వరాలు కలుషితమైన నీరు కలుషితమైన మన ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా వ్యక్తిగత పరిశుభ్రత లోపము వల్ల సంభవిస్తాయని దోమలు కుట్టడం వల్ల డెంగు మలేరియా చికెన్ గునియా వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం వల్ల టైఫాయిడ్ నీళ్ల విరోచనాలు కామెర్లు మొదలగు వ్యాధులు తో బాధపడతారని కాబట్టి ప్రజలు దోమలు పెరగకుండా వారానికి ఒకసారి నీళ్ల తొట్టెలు, డ్రమ్ములు, మొదలగు వాటిని కడిగి మూతలు పెట్టుకోవాలని ఇంటి పరిసరాలు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు అలాగే కాచి చల్ల ర్చిన నీటినే తాగాలని, రోడ్డు ప్రక్కన మూతలు లేని ఆహార పదార్థాలు తినరాదని వేడి వేడి ఆహార పదార్థాలను తినాలని సూచించారు ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మేక శ్రీనివాసరావు,రాజు, ఆరోగ్య కార్యకర్త మార్త ఆశా కార్యకర్తలు మల్లికా,లావణ్య తదితరులు పాల్గొన్నారు.




# ఏలూరు జిల్లాలో ఘనంగా వృక్షా బంధన్ పై వినూత్న కార్యక్రమం






- ప్రకృతికి రక్షణ అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణ,అటవీ సంపద సంరక్షణపై ప్రజల్లో అవగాహన
- జిల్లా అటవీ శాఖాధికారి పి.వి. సందీప్ రెడ్డి

**ఏలూరుజిల్లా ప్రతినిధి,న్యూస్ నేడు:** ఏలూరు జిల్లా అటవీ శాఖాధికారి (డియఫ్ ఓ) పి.వి. సందీప్ రెడ్డి, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని అటవీ రేంజ్ పరిధిలలో 'వృక్షా బంధన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. "చెట్టుకి రాఖీ ప్రకృతికి రక్షణ" అనే నినాదంతో పర్యావరణ పరిరక్షణ, అటవీ సంపద సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. జిల్లా అటవీ శాఖాధికారి ఆదేశానుసారం జిల్లా పరిధిలోని ఏలూరు, నూజివీడు,జంగారెడ్డిగూడెం, కన్నపురం,పోలవరం, కుక్కునూరు మరియు అమరవరం తదితర అన్ని రేంజ్లలోనూ ఫారెస్ట్ రేంజ్ అధికారులు ఈ అవగాహన కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామసింగవరం అటవీ ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా 200 మొక్కలు నాటి, వాటిని కంటికి రెప్పలా కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేస్తూ చెట్లకు రాఖీలు కట్టారు.

కార్యక్రమంలో కె.ఎస్.వి. హరి గోపాల్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్ ఆర్ ఓ ), ఏలూరు మరియు సిబ్బంది, టి.వి. పద్మావతి, ప్రధానోపాధ్యాయురాలు (హెడ్ మాస్టర్), జెడ్పీ ఉన్నత పాఠశాల, రామసింగవరం. రామసింగవరం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు వన సంరక్షణ సమితి (వి ఎస్ ఎస్) సభ్యులు మరియు అటవీ శాఖ సిబ్బంది ప్రకృతిని కాపాడుకోవడం, భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా అధికారులు స్పష్టం చేశారు.

# స్కానింగ్ సెంటర్ల దరఖాస్తుల పరిశీలన

- సరైన పత్రాలు లేని ఆస్పత్రులకు నోటీసులు
- డీఎంహెచ్ ఓ కామేశ్వర రావు

కర్నూలు వైద్యం, న్యూస్ నేడు : కర్నూలు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో డి.ఎం.అండ్.హెచ్.ఓ. డా.వై.కామేశ్వర ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి పి.సి.డపి.ఎన్డి.టి (గ్రాజఢూచీణు) అడ్వైజరీ కమిటీ సమావేశము శుక్రవారం జరిగింది. స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ కోసం వచ్చిన దరఖాస్తులను సభ్యులు పరిశీలించారు. సరైన పత్రాలు లేని కొన్ని ఆస్పత్రులకు నోటీసులు ఇవ్వాలని కమిటీ తీర్మానించింది. మిగిలినవి జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే జిల్లాస్థాయి మల్టీ మెంబర్ అప్ర పియట్ అథారిటీ కమిటీ ఆమోదం కోసం పంపాలని తీర్మానించారు. జిల్లావ్యాప్తంగా పి.సి.పి.ఎన్డి.టి (గ్రాజఢూచీణు ాూజు) చట్టం గురించి అవగాహన కల్పించాలని కమిటీ సూచించింది. సమావేశంలో అదనపు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. ఎల్ .భాస్కర్ , పి.సి.డపి.ఎన్డి . టి జిల్లా నోడల్ అధికారి డా. ఉమా , ప్రొఫెసర్ అండ్ హెచ్.ఓ.డి. డా. స్నిగ్ధ చంద్రశేఖర్ , ప్రొఫెసర్ ఢ హెచ్.ఓ.డి డిపార్ట్మెంట్ ఆఫ్ పీడియాటిక్స్ డా.బి.విజయానంద బాబు , ప్రొఫెసర్ఢహెచ్.ఓ.డి డిపార్ట్మెంట్ ఢ రేడియాలజీ డా. ఓ. డాక్టర్ పద్మలత , గ్రేడ్-వన్ ఫస్ట్ అడిషనల్ డిస్టిక్ కోర్ట్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సరళ దేవి, డిప్యూటీ డైరెక్టర్ అండ్ ఐ అండ్ పి ఆర్ డిపార్ట్మెంట్ మెంట్ జయమ్మ సెయింట్ లౌడ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ మేంబర్ ఎం. నాగరాజు గారు, సొసైటీ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్ ఎంపవర్మెంట్ మేంబర్ కే .శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ ఎక్స్టెన్షన్ మీడియా ఆఫీసర్ యన్ ప్రకాష్ రాజు , డిప్యూటీ డెమో షఫీ



ఉన్నసాబేగం, మరియు జిల్లాస్థాయి ప్రోగ్రాం ఆఫీసర్స్ డిప్యూటీ హె. ఇ. ఓ పద్మావతి, ప్రాజెక్టనిష్టం ఖలీల్ పాల్గొన్నారు.

----------

# దేవరగట్టులో ఈనెల 30న టెంకాయల వేలంపాటలు

**వేలంలో పాల్గొనేవారు**

**రూ.5,000 డిపాజిట్ చెల్లించాలి**

**హోళగుంద న్యూస్ నేడు:** దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 30వ తేదీన టెంకాయల వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ వీర నాగప్ప తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వేలంపాటల్లో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.5,000 డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని చైర్మన్ వీర నాగప్ప కోరారు. వేలంపాటలో టెంకాయలను దక్కించుకున్న వారు వెంటనే వేలంపాట మొత్తాన్ని చెల్లించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వేలంపాటలు ఆలయ కమిటీ చైర్మన్, ఉప చైర్మన్, కమిటీ సభ్యులు, నేరానికి, తాండ, కొత్తపేట, దేవరగట్టు గ్రామాల పెద్దలు, భక్తుల సమక్షంలో పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి భక్తులు, గ్రామస్థులు సహకరించి వేలంపాటల్లో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ చైర్మన్ వీర నాగప్ప కోరారు.

# ఆరాధనోత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు





## పత్తికొండ, ఎమ్మిగనూరు డిఎస్పీ వెంకటరామయ్య

**మంత్రాలయం న్యూస్ నేడు ;** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి 355 వ సప్త రాత్రోత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని పత్తికొండ, ఎమ్మిగనూరు డిఎస్పీ వెంకట్రామయ్య హెచ్చరించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు మేరకు స్థానిక టిటిడి కళ్యాణ మండపం లో శ్రీ మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాస్ రావు, సురేష్ కోణాపూర్ అధ్వర్యంలో పోలీసు సిబ్బంది తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రత కల్పించేందుకు 200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 8 మంది సిఐ లు, 12 మంది ఎస్సై లు, 42 మంది ఎఎస్ఐ లు, హెడ్ కానిస్టేబుళ్లు, 80 మంది పోలీసులు, 11 మహిళా పోలీసులు, 40 హోం గార్డులతో బందోబస్తు విధుల్లో ఉంటున్నట్లు తెలిపారు. రాఘవేంద్ర స్వామి దర్శనానికి దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రాఘవేంద్రస్వామి 355 వ సప్త రాత్రోత్సవాల సందర్భంగా వచ్చే భక్తుల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా నిర్ణయించిన స్థలాల్లో తమ ప్రైవేటు వాహనాలను నిలిపే విధంగా విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బంది సూచించాలని ఆదేశించారు. శ్రీ మఠంలో భక్తుల తొక్కిసలాట జరుగకుండా మఠం యాజమాన్యం సూచించిన క్యూలైన్ల ద్వారా భక్తులకు దర్శన భాగ్యం కల్పించాలని, విఐపిలు దాతలకు, బందోబస్తు ఏర్పాటులో నిఘా ఉంచాలని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని లేని పక్షంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మంత్రాలయం సిఐ లు దస్తగిరి బాబు, రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్సై లు మల్లికార్జున , విజయ్ కుమార్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికలకు జనసేన సన్నద్ధం

- పొత్తు ధర్మం ఆధారంగా ఎన్నికల్లో పోటీ
- విధివిధానాలపై 14మందితో జనసేన కమిటీ







**అమరావతి,ఆగస్ట్28** : స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన సన్నద్ధమవుతోంది. ఈక్రమంలోనే విధివిధానాల రూపకల్పనపై 14 మంది సభ్యులతో ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలపై తొలి సమావేశం శుక్రవారం మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో జరిగింది. ఆయా జిల్లాల వారీగా బలాబలాలు, పోటీ చేసే స్థానాలపై ఈ సమావేశంలో అగ్రనేతలు చర్చించారు. ఈ సమావేశంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నేతలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎన్నికలపై మంత్రి కందుల దుర్గేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2021లో జరిగిన స్థానిక ఎన్నికల్లో ముందుకొచ్చిన జనసైనికులు, వీరమహిళలు ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ఈ ఎన్నికల్లో కూటమి పార్టీల పొత్తుధర్మం పాటిస్తామని వ్యాఖ్యానించారు. స్థానిక ఎన్నికలపై కీలక అంశాలపై చర్చించామని మంత్రి తెలిపారు. యూత్‌ను లీడర్ షిప్ దిశగా తీసుకెళ్లేలా నిర్ణయించామని అన్నారు. ఈ ఎన్నికలపై 25 పార్లమెంట్‌లకు ప్రాతినిధ్యం అప్పగిస్తారని వెల్లడించారు. సెప్టెంబరు నెల అంతా పార్టీ బలోపేతం, నాయకత్వం బలంగా ఉండేలా చూసుకుంటామని చెప్పుకొచ్చారు. స్థానికంగా ఉండే పరిస్థితుల ఆధారంగా పోటీ చేయడంపై దృష్టిపెడతామని మంత్రి కందుల దుర్గేశ్ పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో
స్థానిక ఎన్నికల్లో జనసేన ఎక్కడ పోటీ చేయాలనే విషయాలపై ఆత్మీయ సమావేశంలో చర్చించామని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి తెలిపారు. 2019 కంటే జనసేన ప్రాబల్యం పెరుగుతోందని అన్నారు. రానున్న ఎన్నికల్లో సీట్ల శాతం పెరిగితే బాగుంటుందని అనుకుంటున్నామన్నారు. తాము పోటీ చేసే స్థానాల్లో గెలవాలని నిర్ణయించామని తెలిపారు. క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ లేని వారిని స్థానిక ఎన్నికల్లో గెలిపించాలని నిర్ణయించామని ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. జనసేన స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధత ఆత్మీయ సమావేశంలో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో తెగువతో పోటీ చేసిన 1000 మంది జనసేన అభ్యర్థులను సత్కరించారు. ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అభ్యర్థులకు ఘనంగా సన్మానించారు. 1000 మంది అభ్యర్థులను మంత్రి నాదెండ్ల మనోహర్ సత్కరించారు. స్థానిక ఎన్నికల్లో పోటీ చేసిన వారికి జనసేన పార్టీ గౌరవం ఇచ్చింది. అభ్యర్థుల సత్కారంతో ఈ ఎన్నికల సన్నద్ధత సమావేశం ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో పార్టీ కోసం నిలబడిన వారికి జనసేన అధినాయకత్వం ప్రత్యేక గౌరవం ఇచ్చింది.

---------

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ పురోగతి, చేపడుతున్న చొరవపై ఏలూరుకు రెండవ స్థానం




**ఏలూరు, ఆగస్టు 28** : జిల్లా కలెక్టరేటు గౌతమి సమావేశమందిరంలో శుక్రవారం ఆర్వోలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీప్రతినిధులతో, జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వితో కలసి జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు లోతేటి శివశంకర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ- 2026 పురోగతి, చేపడుతున్న చొరవపై ఆంధ్రప్రదేశ్ లో ఏలూరు జిల్లా రెండవ స్థానంలో నిలిచిందని, ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగంకు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో ఎన్నికలు ప్రక్రియను విజయవంతం చెయ్యుటకు సంసిద్ధులుగా ఉండాలని, శివశంకర్ కోరారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీలు ప్రతినిధులు తమ అభిప్రాయాలను, సూచనలను, క్షేత్రస్థాయిలో ఉన్న ఇబ్బందులను తెలియజేశారు. శివశంకర్ మాట్లాడుతూ ఏలూరు క్షేత్రస్థాయిలో పోలింగు స్టేషన్లు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ- 2026 పురోగతి, బియల్వో లు పనితీరును అధ్యయనం చేశామని, నాకు సంతృప్తి కలిగిందని అన్నారు. ఎటువంటి లోపాలు లేని ఓటరు జాబితా నిరంతరాయంగా మార్పులు, చేర్పులు చేస్తూ, అనర్హులను తొలగిస్తూ, అర్హులను జతచేస్తూ స్వచ్ఛమైన ఓటరు జాబితా సిద్ధం చెయ్యాలని అన్నారు. స్వచ్ఛమైన విధులు, సమష్టి కృషితో దోషరహిత ఓటర్ల జాబితాను సిద్ధం చెయ్యుటలో గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీప్రతినిధులు సహకారాన్ని అందించాలని అన్నారు. అభ్యంతరాలు గడువు ఈ నెల 30వ తేదీ వరకు ఉందని, రెండు రోజుల్లోగా వివిధ రాజకీయ పార్టీప్రతినిధులు తెలియజేయవచ్చునని అన్నారు. అక్టోబరు 03న ఓటర్ల తుది జాబితా ప్రచురణే లక్ష్యంగా జిల్లాయంత్రాంగం నుండి బియల్వో వరకు మనస్సు పెట్టి పనిచెయ్యాలని స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మేజరు ఇబ్బందులు ఎక్కడ తలెత్తలేదని, అయితే పేర్లలో చిన్నచిన్న తప్పులు ఎక్కువగా వచ్చాయని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఫారం 06 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంటు కలెక్టరు సి.హెచ్.శ్రావణ్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి యం.శ్రీదేవి, నూజివీడు సబ్ కలెక్టరు బొల్లిపల్లి వినూత్న, ఆర్డీవో లు కె.లక్ష్మీప్రసన్న, యం.వి.రమణ, జెడ్పీ సిఈవో పి.జగదాంబ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.భాస్కర్, వి.వి.యస్.శర్మ, యస్సి కార్పొరేషన్ ఇడి యం.ముక్కంటి, జిల్లా విద్యాశాఖ అధికారి యం.వెంకటలక్ష్మమ్మ, ఏఇ ఆర్వోలు, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీప్రతినిధులు సిపిఐ (యం) యస్.సత్యనారాయణ, యం.ఇసాకు, బియస్పి ఏ.రతన కాంత్, టీడీపీ కె.అచ్యుతబాబు, వైఎస్ఆర్సిపి పార్టీ వి.స్టాన్లీ బాబు, యల్.వి.సుభాష్, తుమరాడ స్రవంతి, ఐయన్సి ఆర్.రామచంద్ర రావు, బిజెపి నెరుసు నెలరాజ, గాది రాంబాబు, అనిల్ ఆచార్య, జనసేన తాతపూడి రామ్ చందు, జిల్లా కలెక్టరేటు సూపర్డెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

## లక్కీడ్రా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి

# అర్హులందరికీ ఇళ్లు కేటాయిస్తాం

హైదరాబాద్,ఆగస్ట్28(ఆర్ఎన్ఎ): క్యూర్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్లలో ప్లాట్లను లాటరీ ద్వారా లబ్ధిదారులకు కేటాయిస్తున్నారు. మొదటి దఫాలో 7,350 ఇందిరమ్మ ఇళ్లను అర్హులకు అందించనున్న ప్రభుత్వం కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్, రాజేంద్రనగర్, నాంపల్లి నియోజకవర్గాల్లో లక్కీ డ్రా నిర్వహించింది. శుక్రవారం నాంపల్లి నియోజకవర్గంలోని లక్కీడ్రాలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. అర్హులైన పేదలందరికీ నిష్పక్షపాతంగా ఇళ్లు ఇస్తున్నామని తెలిపారు. పేదల ఆత్మగౌరవానికి చిహ్నంగా రూ. వందల కోట్లు ధర పలికే భూముల్లోనూ ఇళ్లు నిర్మించి ఇస్తామన్నారు. మొదటివిడతలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హులందరికీ ఇళ్లు ఇచ్చామని, మరో 10 రోజుల్లో రెండో విడత జాబితా విడుదల చేస్తామన్నారు. 16 నియోజకవర్గాల్లో స్థలాలు సేకరించి టెండర్లు పూర్తిచేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో టవర్ల నిర్మాణం ప్రారంభిస్తామని మంత్రి తెలిపారు. ఇళ్ల రిజిస్ట్రేషన్‌కు ఎలాంటి ఛార్జీలు వసూలు చేయట్లేదన్నారు. పదేళ్ల తర్వాత ఇంటిని అమ్ముకునే హక్కు లబ్ధిదారులకు ఉందన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత ఇంటిని తాకట్టు పెట్టుకునేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు.

# పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు తప్పనిసరి

- నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానంపై ఆరా తీయాలి
- నేర నియంత్రణలో సాంకేతకితకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి
- తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశం




హైదరాబాద్,ఆగస్ట్28 : నేరాల దర్యాప్తు, పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. నేరాల సమీక్షను కేవలం గణాంకాలకే పరిమితం చేయకుండా.. ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానం, దర్యాప్తు తీరు, ఆయా కేసుల పరిష్కారాన్ని సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. అన్ని యూనిట్ల పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని యూనిట్ల పోలీసు అధికారులకు పలు కీలక అంశాలపై డీజీపీ దిశా నిర్దేశం చేశారు. సాంకేతికతను నేర నియంత్రణకు సాధనంగా వినియోగించాలని డీజీపీ సూచించారు. సైబర్, ఆర్థిక నేరాలు తగ్గాయని అన్నారు. మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టిసారించామని వెల్లడించారు. ఆయా యూనిట్ల వారీగా నెలవారీ సమీక్షలు తప్పనిసరని స్పష్టం చేశారు. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని మార్గనిర్దేశర చేశారు. ఇటీవల సీసీటీఎన్ఎస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గతంలో 70 నుంచి 80 శాతంగా ఉన్న.. సీసీటీఎన్ఎస్ డేటా అప్‌డేట్.. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో 96 శాతానికి చేరడం అభినందనీయమని డీజీపీ పేర్కొన్నారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు పాటించాల్సిన ప్రాథమిక విధానాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రొఫెషనల్ స్టాండర్డ్స్‌ను పాటించడాన్ని అధికారులు పోటీగా తీసుకోవాలని సూచించారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఆయా జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల సమయంలో గుర్తించే అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. నేరాల ధోరణిని ముందుగానే గుర్తించి, అవసరమైన చోట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా హాజరయ్యారు. అలాగే, రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్రంలో 7.15శాతం నేరాలు పెరిగాయని డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల కేసుల్లో 46.10శాతం వృద్ధి సాధించిందని అన్నారు.
సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగాయని వివరించారు. 2023-24లో 2,65,377 కేసులు నమోదుకాగా.. 2025-26లో 2,84,363కు చేరాయని చెప్పారు. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కి పెరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాల కేసులు 2023-24లో 2,026 ఉండగా.. 2025-26లో 2,960కు చేరాయని ప్రస్తావించారు. మూడేళ్లలో 46.10 శాతం పెరిగాయని వెల్లడించారు. వ్యవస్థీకృత నేరాలు 25 నుంచి 451కు పెరిగి 1,704 శాతం వృద్ధిని నమోదు చేశాయని అన్నారు. ట్రాఫిక్ నేరాలు 29,130 నుంచి 31,891కు పెరిగి 9.48 శాతం వృద్ధి చెందాయన్నారు. మరోవైపు సైబర్ నేరాలు 25,373 నుంచి 22,000కు తగ్గి 13.29 శాతం, ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు తగ్గి 13.28 శాతం క్షీణించాయని చెప్పారు. తీవ్ర నేరాల్లో 10.33శాతం తగ్గాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# కోడిపందాలను చట్టబద్దం చేయలేం

- జంతు సంరక్షణలో పక్షులు కూడా భాగమే
- కోడి పందాలను సాంస్కృతిక వారసత్వంగా గుర్తించలేం
- సినిమాలు, ఆచారాలు చూపి..పందాలను నడపడం సాధ్యం కాదు
- మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పష్టీకరణ

**చెన్నై,ఆగస్ట్28** : కోడిపందేలపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ పందేలు నిర్వహించడం చట్టపరిధిలో పూర్తిగా నిషేధమని మద్రాస్ హైకోర్టు మధురై బెంచ్ స్పష్టం చేసింది. గతంలో అనుమతులిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్టపరంగా చెల్లవని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ వ్యాఖ్యానించారు. కోడిపందేల నిర్వహణ పౌరుల ప్రాథమిక హక్కు కాదని తేల్చిచెప్పారు. జంతు హింస నిరోధక చట్టం-1960 ప్రకారం కోడిపందేలు తీవ్ర నేరమని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ అభిప్రాయపడ్డారు. 'రిట్ ఆఫ్ మాండమస్' కింద అనుమతులు జారీ చేయలేమని తేల్చిచెప్పారు. కోడిపందేలకు 'సంస్కృతి' హోదా ఇవ్వలేమని పేర్కొన్నారు. సినిమాలు, ఆచారాల్లో ప్రసిద్ధి చెందినంత మాత్రాన ఈ పందేలను సాంస్కృతిక క్రీడగా గుర్తించలేమని తెలిపారు. జల్లికట్టు తరహాలో ప్రత్యేక చట్టసవరణ లేనంతవరకు మినహాయింపులు ఇవ్వలేమని స్పష్టం చేశారు. కత్తులు కట్టకపోయినా పందేలు నేరమేనని చెప్పుకొచ్చారు. కత్తులు లేవనే సాకుతో ఈ పందేలకు అనుమతి కోరిన పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు తెలిపారు. జంతు సంక్షేమ చట్టంలో 'పక్షులు' కూడా భాగమేనని స్పష్టం చేశారు. జల్లికట్టు లాగా ప్రత్యేక చట్టసవరణ తీసుకువస్తేనే మినహాయింపు దక్కుతుందని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ స్పష్టం చేశారు. గతంలో కోడిపందేలకు అనుమతిస్తూ ఇచ్చిన ఉత్తర్వులు చట్టవిరుద్ధమని జస్టిస్ జి.ఆర్. స్వామినాథన్ వ్యాఖ్యానించారు. గత తీర్పులను భవిష్యత్తు కేసుల్లో నిదర్శనంగా పరిగణించరాదని తెలిపారు. ఆయా షరతులతో కోడిపందేలకు అనుమతి ఇచ్చిన పాత ఉత్తర్వులపై రివ్యూ పిటిషన్‌లో కీలక తీర్పు వెల్లడించారు. కత్తులు కట్టకుండా నిర్వహించినా కోడిపందేలకు చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. పక్షులకు గాయాలు కాకుండా చూడాలనే షరతులతో ఇచ్చిన పాత అనుమతులు కూడా చట్టానికి విరుద్ధమేనని తెలిపారు. జంతు హింస నిరోధక చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించి ఈ పందేలకు అనుమతి ఇవ్వలేమని అన్నారు. కోడిపందేలకు అనుమతి ఇచ్చిన గత డివిజన్ బెంచ్ ఉత్తర్వులు 'పూర్తిగా అనవసరం' అని వ్యాఖ్యానించారు. తంజావూరు జిల్లా కలెక్టర్ దాఖలు చేసిన రివిజన్ పిటిషన్‌కు మద్రాస్ హైకోర్టు అనుకూల తీర్పు ఇచ్చింది.

## గోదావరిఖనిలో మృత్యుంజయ హోమం

**గోదావరిఖని,ఆగస్ట్28 :** రాఖీ పూర్ణిమ పర్వదినం పురస్కరించుకొని లోక కల్యాణార్థం గోదావరిఖని మార్కండేయ కాలనీలో గల శ్రీ మార్కండేయ శివాలయం ఆవరణలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. ప్రతి ఏటా రాఖీ పౌర్ణమి రోజున మార్కండేయుడి సన్నిధిలో జరిగే ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ ప్రధాన అర్చకులు చిగురాల రాఘవాచార్యులు మంత్రోచ్ఛారణల మధ్య రక్షాబంధన, యజ్ఞోపవీత దారణ, గణపతి, నవగ్రహ, మార్కండేయ పూజలతోపాటు మృత్యుంజయ హోమంను అత్యంత వైభవంగా నిర్వహించారు. పద్మశాలీ కులస్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మంచికట్ల భిక్షపతి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో 47వ డివిజన్ కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి, వంగ వీరస్వామి, రాజమల్లు, గడ్డం జానకీరాం, కానుగంటి నారాయణ, పోరండ్ల కొమురయ్య, ఆర్ఎస్ మూర్తి, మాటేటి సతీష్, బొద్దుల వేణు, గడ్డం సత్యనారాయణ, అడిచర్ల నంబయ్య, గోసిక సత్యం, నాగేశ్వరరావుతోపాటు అధిక సంఖ్యలో పద్మశాలీలు పాల్గొన్నారు.

శనివారం,
ఆగస్టు 29 2026
న్యూస్ నేడు
newsnedu.com

# అఫ్గాన్‌తో టీ20 సిరీస్ కు అభిషేక్ శర్మపై వేటు?



భారత పురుషుల క్రికెట్ జట్టు సెప్టెంబర్ 2026లో అఫ్గానిస్తాన్‌తో మూడు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో తలపడనుంది. ఈ సిరీస్ కోసం అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు 15 మంది సభ్యులతో కూడిన తమ బలమైన జట్టును అధికారికంగా ప్రకటించింది. ఇందులో స్టార్ ఫాస్ట్ బౌలర్ నవీన్ ఉల్ హక్ దాదాపు రెండేళ్ల విరామం తర్వాత తిరిగి జట్టులోకి రావడం విశేషం. నవీన్ చివరిసారిగా డిసెంబర్ 2024లో అఫ్గానిస్తాన్ తరఫున అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు. కాగా, భారత క్రికెట్ నియంత్రణ మండలి వచ్చే నెలలో జరగనున్న ఈ సిరీస్ కోసం భారత జట్టును త్వరలోనే ప్రకటించనుంది. ఈ మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఢిల్లీలోని ప్రసిద్ధ అరుణ్ జైట్లీ స్టేడియంలో సెప్టెంబర్ 13, 15 మరియు 17 తేదీల్లో జరగనుంది. అంతర్జాతీయ స్థాయిలో ఎంతో ప్రమాదకరమైన జట్లను సైతం ఓడించే సత్తా ఉన్న అఫ్గానిస్తాన్‌ను టీమిండియా ఏమాత్రం తేలికగా తీసుకునే పరిస్థితి లేదు. మరోవైపు, ఈ సిరీస్ భారత ఆటగాళ్లకు రాబోయే ఏషియన్ గేమ్స్ 2026 సన్నాహకాల కోసం అత్యంత కీలకమైన వేదికగా ఉపయోగపడనుంది. భారత్ గత జూలైలో జింబాబ్వేతో జరిగిన టీ20 సిరీస్‌లో హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జరిగిన మూడు మ్యాచ్‌లను క్లీన్ స్వీప్ చేసింది. అయితే అంతకుముందు ఐర్లాండ్, ఇంగ్లండ్‌లతో ఆడిన టీ20 సిరీస్‌లలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా గెలవలేక తీవ్రంగా నిరాశపరిచింది. దీంతో సెలెక్టర్లు అఫ్గానిస్తాన్‌తో పోరు కోసం పటిష్టమైన సమతూకంతో కూడిన జట్టును ఎంపిక చేయాలని భావిస్తున్నారు. గతంలో ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అందుకున్న విధ్వంసకర బ్యాటర్ అభిషేక్ శర్మ ఇటీవలి కాలంలో తీవ్ర ఫామ్‌లేమితో ఇబ్బంది పడుతున్నాడు. జింబాబ్వే పర్యటనతో పాటు, ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ బ్యాట్‌తో రాణించడంలో విఫలమయ్యాడు. దీంతో అఫ్గానిస్తాన్ సిరీస్ నుంచి అతడిని తప్పించినా ఆశ్చర్యపోనక్కర్లేదని తెలుస్తోంది. అభిషేక్ శర్మ స్థానంలో కేరళకు చెందిన స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ తిరిగి జట్టులోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2026లో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకున్న శాంసన్‌ను జింబాబ్వే సిరీస్‌కు ఎంపిక చేయకపోవడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజా సిరీస్‌తో అతను మళ్లీ మెయిన్ స్క్వాడ్‌లోకి రావడం ఖాయంగా కనిపిస్తోంది. భారత్ తరఫున టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన స్టార్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ ఈ సిరీస్‌కు పునరాగమనం చేయడం ఖాయం. అయితే సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్‌ను సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. నవంబర్ 2022 తర్వాత భువనేశ్వర్ భారత్ తరఫున మళ్లీ మ్యాచ్ ఆడలేదు. యితే ఐపీఎల్ 2026లో ఆర్సీబీ తరఫున అద్భుత స్వింగ్ బౌలింగ్‌తో మెరిసిన భువీ, ప్రస్తుతం యూపీ టీ20 లీగ్‌లోనూ నిలకడగా వికెట్లు తీస్తూ వార్తల్లో నిలుస్తున్నాడు. దీంతో అతడిని తిరిగి జాతీయ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. త్వరలోనే బీసీసీఐ పూర్తి జట్టు వివరాలను ప్రకటించే అవకాశం ఉంది.

## కొత్త గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా డ్రీమ్11




డ్రీమ్11 కొత్త దారిలోకి అడుగుపెట్టింది. రియల్ మనీ గేమింగ్, నగదు బహుమతులతో కూడిన ఫాంటసీ స్పోర్ట్స్ కాంటెస్టులను ఆపేసిన ఏడాది తర్వాత, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా స్పోర్ట్స్ అభిమానులను కలిపే ప్లాట్‌ఫామ్‌గా మారిందని పీటీఐ వెల్లడించింది. ఇకపై డ్రీమ్11లో ప్రైజ్ మనీ ఉండదు. స్పోర్ట్స్ కంటెంట్, లైవ్ స్ట్రీమింగ్, స్కోర్లు, స్టాట్స్, కమ్యూనిటీ ఫీచర్లు, స్పోర్ట్స్ అనుభవాలు, సోషల్ కాంటెస్టులపై సంస్థ దృష్టి పెట్టనుంది. గురువారం డ్రీమ్11 ఈ మార్పును ప్రకటించింది. ఇంతకాలం ఫాంటసీ స్పోర్ట్స్‌పై ప్రధానంగా దృష్టి పెట్టిన ప్లాట్‌ఫామ్, ఇప్పుడు గ్లోబల్ స్పోర్ట్స్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌గా మారింది.

కొత్త ప్లాట్‌ఫామ్‌లో ఏఐకి ప్రధాన పాత్ర ఉండనుంది. యూజర్లు ఇష్టపడే స్పోర్ట్స్, లీగ్‌లు, టీమ్‌లు, ప్లేయర్ల ఆధారంగా వారికి నచ్చే కంటెంట్, అనుభవాలను వ్యక్తిగతంగా అందించనుంది. ప్రపంచవ్యాప్తంగా స్పోర్ట్స్ అభిమానులను ఒక కమ్యూనిటీగా కలపడం ద్వారా 'మేక్ స్పోర్ట్స్ బెటర్' అనే తమ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లాలని డ్రీమ్11 చెబుతోంది. కొత్త డ్రీమ్11లో ఒక్క క్రికెట్‌కే పరిమితం కాకుండా పలు రకాల స్పోర్ట్స్ అందుబాటులో ఉంటాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అభిమానులను దృష్టిలో పెట్టుకుని ప్లాట్‌ఫామ్‌ను రూపొందిస్తున్నారు. యూజర్లు లైవ్ మ్యాచ్‌లు చూడొచ్చు. గత వారాంతంలో జరిగిన రేస్‌ను ఫాలో అవ్వొచ్చు. స్టాటిస్టిక్స్, కామెంటరీ చూడొచ్చు. స్పోర్ట్స్‌కు సంబంధించిన ప్రత్యేక అనుభవాలను బుక్ చేసుకోవచ్చు. స్నేహితులు, ఇతర స్పోర్ట్స్ అభిమానులతో కలిసి సోషల్ కాంటెస్టుల్లో పాల్గొనొచ్చు.డ్రీమ్11 సీఈఓ వైభవ్ కోకల్ మాట్లాడుతూ, తమ 30 కోట్ల మంది యూజర్లతో పనిచేసిన అనుభవం ద్వారా స్పోర్ట్స్ అభిమానులు కేవలం ఆటను మాత్రమే కోరుకోవడం లేదని చెప్పారు. వాళ్లు ఒక కమ్యూనిటీలో భాగంగా ఉండాలని కూడా కోరుకుంటున్నారని తెలిపారు. "దేశంలోని అత్యుత్తమ టెక్ టాలెంట్ మద్దతుతో, ఇండియాలో తయారై ప్రపంచం కోసం రూపొందించిన ఏఐ-ఫస్ట్ స్పోర్ట్స్ ఎంగేజ్‌మెంట్ ప్లాట్‌ఫామ్‌ను ఇప్పుడు నిర్మిస్తున్నాం" అని ఆయన చెప్పారు. గత ఏడాది ఆగస్టులో పార్లమెంట్ 'ప్రొమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025'ను ఆమోదించిన తర్వాత డ్రీమ్11 తన రియల్ మనీ గేమింగ్ కార్యకలాపాలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ తర్వాత ప్లాట్‌ఫామ్‌లో డబ్బులు చెల్లించి ఆడే కాంటెస్టులన్నింటినీ ఆపేసింది. కొత్త చట్టానికి అనుగుణంగా ఉచితంగా ఆడే సోషల్ గేమింగ్ మోడల్‌కు మారింది. మొత్తంగా చూస్తే, డ్రీమ్11 ఇకపై డబ్బులు గెలుచుకునే ఫాంటసీ స్పోర్ట్స్ యాప్‌గా కాకుండా, లైవ్ స్పోర్ట్స్, కంటెంట్, స్టాట్స్, కమ్యూనిటీ, సోషల్ కాంటెస్టులు, స్పోర్ట్స్ అనుభవాలను ఒకే చోట అందించే గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌గా తన కొత్త ప్రయాణాన్ని కొనసాగించనుంది.

# ఐసీసీపై మండిపడ్డ స్టీవ్ వా

వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. వాస్తవానికి దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ 50 ఓవర్ల మెగా ఈవెంట్‌లో 14 జట్లు తలపడాల్సి ఉంది. అయితే ఐసీసీ తీసుకున్న తాజా నిర్ణయంతో ప్రధాన టోర్నీలో కేవలం 12 జట్లే ఆడనున్నాయి. కొత్త ఫార్మాట్ ప్రకారం.. 12, 13, 14వ ర్యాంకుల్లో ఉన్న జట్లు ముందుగా క్వాలిఫైయింగ్ రౌండ్‌లో తలపడతాయి. అందులో నుంచి విజేతగా నిలిచిన ఒక్క జట్టు మాత్రమే మిగతా 12 ప్రధాన జట్లతో కలుస్తుంది. ఆ తర్వాత మొత్తం 12 జట్లను చెరో ఆరు జట్లతో రెండు గ్రూపులుగా విభజించి ప్రధాన టోర్నీని నిర్వహిస్తారు. ఐసీసీ తీసుకున్న ఈ ఫార్మాట్ మార్పు నిర్ణయంపై ఇప్పటికే అసోసియేట్ దేశాలైన స్కాట్లాండ్, నెదర్లాండ్స్ క్రికెట్ బోర్డులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఆగస్టులో ఈ రెండు బోర్డులు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ఐసీసీ నిర్ణయం అసోసియేట్ దేశాల క్రికెట్‌కు పెద్ద ఎదురుదెబ్బ అని, ఇటీవల కాలంలో ఆటను విస్తరించడానికి సాధించిన పురోగతిని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశాయి. "టోర్నమెంట్ ప్రారంభానికి 18 నెలల కంటే తక్కువ సమయం ఉన్న తరుణంలో, పురుషుల 50 ఓవర్ల ప్రపంచకప్ క్వాలిఫికేషన్ ప్రక్రియ, టోర్నమెంట్ ఫార్మాట్‌లో ఐసీసీ భారీ మార్పులు చేయడం తీవ్ర నిరాశ కలిగించింది. క్రికెట్ తన పరిధిని విస్తరించుకోవాలని, కొత్త ప్రేక్షకులను ఆకర్షించాలని చూస్తున్న తరుణంలో.. ఎదుగుతున్న చిన్న దేశాలకు అవకాశాలు తగ్గించడం అంతర్జాతీయ క్రీడా ప్రపంచానికి చాలా తప్పుడు సంకేతాన్ని పంపుతుంది" అని ఆ ప్రకటనలో పేర్కొన్నాయి.



## రవీంద్ర జడేజా చెత్త రికార్డ్..




టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చెత్త రికార్డ్ నమోదు చేశాడు. టెస్ట్ క్రికెట్‌లో అతి తక్కువ కాలంలో అత్యధిక నోబాల్స్ వేసిన ఆటగాడిగా అప్రతిష్టను మూటగట్టుకున్నాడు. 2021 నుంచి టెస్ట్‌ల్లో జడేజా 88 నోబాల్స్ వేసాడు. శ్రీలంకతో రెండో టెస్ట్‌లో జడేజా మొత్తం నాలుగు నోబాల్స్ వేసాడు. తొలి ఇన్నింగ్స్‌లో మూడు నోబాల్స్ వేసిన జడేజా.. రెండో ఇన్నింగ్స్‌లో ఒకటి వేసాడు. తొలి టెస్ట్‌లోనూ జడేజా నాలుగునో బాల్స్ వేసాడు. ఇన్నింగ్స్‌కు రెండు చొప్పున నోబాల్స్ సంధించాడు. ఇందులో ఒకటి ధనంజయ డి సిల్వాకు లైఫ్‌లైన్‌గా మారింది. దాంతో టెస్టు క్రికెట్‌లో ఒక స్పిన్నర్ అత్యధిక నో బాల్స్ వేసిన చెత్త రికార్డును జడేజా మూటగట్టుకున్నాడు. జడేజా తర్వాత రెండో స్థానంలో పాకిస్థాన్ స్పిన్నర్ నోమన్ అలీ ఉన్నాడు.రెండో టెస్ట్‌లో జడేజాతో సహా భారత బౌలర్లంతా 10 నోబాల్స్ వేసారు. అఫ్గానిస్థాన్(14) తర్వాత అత్యధిక నోబాల్స్ వేసిన జట్టుగా భారత జట్టు అప్రతిష్టను మూటగట్టుకుంది.ఈ మ్యాచ్‌లో టీమిండియా గెలుపు ముంగిట నిలిచింది. 213 పరుగుల భారీ లోటుతో ఫాలో ఆన్ ఆడిన శ్రీలంక నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 72.4 ఓవర్లలో 6 వికెట్లకు 229 పరుగులు చేసింది. క్రీజులో కేశర నువాంత(3 బ్యాటింగ్), సోనాల్ దినుషా(7 బ్యాటింగ్) ఉన్నారు.తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీతో ఆకట్టుకున్న సోనాల్ దినుషాను ఔట్ చేస్తే భారత విజయం లాంఛనం కానుంది. ప్రస్తుతం శ్రీలంక 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఆఖరి రోజైన గురువారం శ్రీలంకను వీలైనంత త్వరగా ఆలౌట్ చేస్తే భారత్ విజయం సులువు అవుతుంది.

## 18న వస్తోన్న అనుమాన పక్షి




డిజె టిల్లు'తో సెన్సేషనల్ డెబ్యూను అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ రెండో సినిమా 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్ హీరోగా ఈ సినిమాను రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మించారు. తొలి చిత్రం తరహాలోనే ఈ సినిమానూ యునిక్ కామెడీ ఎంటర్ టైనర్ గా విమల్ కృష్ణ తెరకెక్కించారు. తమ 'అనుమాన పక్షి' చిత్రం సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల తేదీని తెలియజేస్తూ ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమా విభిన్నమైన టోన్‌తో పాటు హీరో విచిత్రమైన ఆలోచనా విధానాన్ని ఈ పోస్టర్ ప్రజెంట్ చేస్తోంది. రాగ్ మయూర్ సంప్రదాయ దుస్తుల్లో చేతిలో రైఫిల్ పట్టుకుని కనిపిస్తున్నారు. ఆయన పక్కనే ఉన్న బ్లాక్‌బోర్డుపై 'డౌట్స్ అండర్ ఇన్వెస్టిగేషన్' అనే టైటిల్‌తో జీవితం, విధి, కర్మ, దేవుడి ఎ÷-లానింగ్స్ కు సంబంధించిన ఆసక్తికరమైన ప్రశ్నలను పొందుపరిచారు. 'ఒన్ బోయ్. బిలియన్ థాట్స్, జీరో చిల్' అనే ట్యాగ్‌లైన్ ఆయన పాత్రలోని ఆలోచనా విధానాన్ని మరింత ఆసక్తికరంగా తెలియజేస్తోంది.

# టాక్సిక్‌లో మహిళలను తప్పుగా చిత్రీకరణ

## తమిళనాడు మాజీ బిజెపి నేత అన్నామలై ఆగ్రహం





రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కిన తాజా పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమాపై తమిళనాడుకు చెందిన మాజీ బీజేపీ నేత కే. అన్నామలై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ చిత్రంలో మహిళలను తప్పుగా చిత్రీకరించారని, ఇది యువతపై చెడు ప్రభావం చూపుతుందని ఆయన విమర్శించారు. కోయంబత్తూరులో జరిగిన ఓ బహిరంగ సభలో అన్నామలై మాట్లాడుతూ సినిమాల ప్రభావం సమాజంపై ఏ విధంగా ఉంటుందో ప్రస్తావించారు. 'నిన్న ఓ సినిమా గురించి విన్నాను. అది మొదటి రోజే రూ. 104 కోట్లు వసూలు చేసింది. మనం ఎప్పుడూ మంచి విషయాలు మాట్లాడాలని చూస్తాం, కానీ ఏకంగా సినిమా పేరునే 'టాక్సిక్' అని పెట్టుకున్నారు. ఈ చిత్రం మహిళలను తప్పుగా చూపిస్తూనే భారీగా డబ్బు సంపాదిస్తోంది' అని ఆయన మండిపడ్డారు. ఇలాంటి చిత్రాలను విద్యార్థులు, యువత చూస్తే దేశం ఏ దిశగా పయనిస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు నగరాల్లో మహిళల భద్రత గురించి చర్చిస్తున్నామని, మరోవైపు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (అఃఈఅ) ఇలాంటి చిత్రాలకు ఎలా అనుమతి ఇస్తోందని ఆయన ప్రశ్నించారు. సినిమాలలో మహిళలను గౌరవించే విధానం ఉండాలని, సర్టిఫికేషన్ విషయంలో సెన్సార్ బోర్డ్ మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, హ్యూమా ఖురేషి తదితరులు కీలక పాత్రలు పోషించారు. బుధవారం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధించినప్పటికీ, దీనిలోని అభ్యంతరకర సన్నివేశాలు, హింస మరియు మహిళల చిత్రణపై ప్రస్తుతం సర్వత్ర చర్చ జరుగుతోంది.

# దూసుకుపోతున్న ఇరుముడి

### గ్రామీణ ప్రాంతాల్లో భారీగా టిక్కెట్ల అమ్మకం

మాస్ మహారాజా రవితేజ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతూ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. విడుదలైనప్పటి నుంచి వరుసగా రికార్డులు సృష్టిస్తున్న ఈ చిత్రం తాజాగా ఆన్‌లైన్ టికెట్ విక్రయాల్లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. ప్రముఖ టికెటింగ్ ఎ÷-లాట్‌ఫార్మ్‌లైన బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్స్ ద్వారానే 'ఇరుముడి'కి 55 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. ఒక ప్రాంతీయ చిత్రానికి ఈ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.రవితేజ మాస్ అప్పీల్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుండటంతో థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ కొనసాగుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మాస్ ప్రేక్షకుల వరకు అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో సినిమా కలెక్షన్ల పరంగా కూడా దూసుకుపోతోంది. బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఇరుముడి' ఇప్పుడు టికెట్ విక్రయాల్లోనూ తన సత్తా చాటుతూ కొత్త రికార్డులను లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం చిత్రానికి ఉన్న జోరు చూస్తుంటే రాబోయే రోజుల్లో మరిన్ని మైలురాళ్లు అందుకోవడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.




# ప్యారడైజ్ నుంచి నేడు యెష నాగుల పాట విడుదల







టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ పాన్ ఇండియా మూవీ 'ది ప్యారడైజ్' సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి మేకర్స్ ఒక క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాలోని రెండో సింగిల్ డిజిటల్ లాంచ్‌కు రంగం సిద్ధమైంది. 'యెష నాగుల' అంటూ సాగే ఈ పాటను శనివారం అధికారికంగా విడుదల చేయనుండగా.. దానికి ముందుగా ఈరోజు సాయంత్రం ఈ సాంగ్‌ను అనిరుధ్ కన్సర్ట్‌లో పాడబోతున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్న ఈ పాటకు శ్యామ్ లిరిక్స్ అందించగా.. జంగి రెడ్డి, సందీప్ కుమార్ ఆలపించారు. అలాగే సందీప్ మాస్టర్
ఈ పాటకు కొరియోగ్రఫీ చేయడం విశేషం. ఇదిలా ఉంటే, ఈ చిత్రంలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలీ కులకర్ణి, సంపూర్ణేష్ బాబు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 24, 2026న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే ఖరారు చేశారు.

# రేస్-4 ప్రాజెక్టుకు అమిూర్ గ్రీన్ సిగ్నల్

బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ చాలా రోజుల తర్వాత కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రముఖ యాక్షన్ ఫ్రాంచైజీ 'రేస్' నాలుగో భాగంలో ఆయన నటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'రేస్ 4' స్క్రిప్ట్ ఆమిర్ ఖాన్‌కు బాగా నచ్చడంతో ఆయన ఈ ప్రాజెక్ట్‌ను చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఈ చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యతలను ప్రముఖ దర్శకుడు విజయ్ కృష్ణ ఆచార్యకు అప్పగించినట్లు సమాచారం. గతంలో ఆమిర్ ఖాన్, విజయ్ కృష్ణ ఆచర్య కాంబినేషన్‌లో వచ్చిన 'ధూమ్ 3' సినిమా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను విజయ్‌కి ఇవ్వబోతున్నట్లు సమాచారం. కాగా.. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.



# జివితో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న చిరు

తన మిత్రుడు జీవీ నారాయణ రావు అంత్యక్రియలకు హాజరయిన చిరంజీవి ఒకింత భావోద్వేగానికి గురయ్యారు. ఆయన పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించిన చిరంజీవి వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారాయణ రావుతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 1977 నుంచి మా ఇద్దరి మధ్య పరిచయం. ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో కలుసుకున్నాం. తను అప్పటికే సీనియర్ స్టూడెంట్. మేం ట్రైనింగ్‌లో ఉన్నప్పుడు తన అనుభవాలు పంచుకునేవాడు. చాలా క్లోజ్‌గా ఉండేవాళ్లం. తర్వాత ఇండస్ట్రీలో ఎవరికి వాళ్లం బిజీ అయ్యాం. నా సినిమాల్లోనూ ఆయన నటించారు. ఆ తర్వాత మా బాధ్యతల వల్ల ఇద్దరి మధ్య గ్యాప్ వచ్చింది. యాదృచ్ఛికం ఏంటంటే.. పది రోజుల క్రితం కూడా 'మంచుపల్లకి' చూశాను. అందులో ఆయన కీలకపాత్రలో నటించారు. ఆ సినిమా స్ఫూర్తితో కొత్త కంటెంట్‌తో, ఐదుగురు కొత్త వాళ్లతో ఒక స్టోరీ రాశానని జీవీ చెప్పారు. నన్ను చూడాలన్నారు. దాని గురించి మాట్లాడిన తర్వాత ఇద్దరం కలిసి ఓ ఫొటో దిగాం. బహుశా ఆయన చివరి ఆలోచనలు నాతో పంచుకున్నారేమో. చాలా మొండి మనిషి. ఏ విషయాన్నీ లెక్క చేయడు అని తన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.



# నేడు కింగ్ 100 టైటిల్ గ్లింప్స్ విడుదలకు సిద్ధం

టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆయన కెరీర్‌లో వందో మైలురాయిగా నిలుస్తున్న ప్రతిష్టాత్మక 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. యువ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. నాగార్జున పుట్టినరోజు కానుకగా ఆగస్టు 29 ఉదయం 9 గంటలకు 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఫాస్టెన్ యువర్ సీట్‌బెల్ట్స్ రేపటి నుంచి కింగ్ ఆధిపత్యం మొదలవ్వబోతోంది అంటూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పంచుకున్న ఈ అనౌన్స్‌మెంట్ ప్రస్తుతం అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.



# శూర్పణఖ ఓ భిన్నమైన వ్యక్తిత్వం ఉన్న మహిళ: రకుల్

రామాయణ స్క్రిప్ట్ తనకు శూర్పణఖలోని కొత్త కోణాలను అన్వేషించడంలో సహాయపడిందని కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ అన్నారు. ఇప్పుడామె నితేశ్ తివారీ దర్శకత్వంలో రూపొందుతున్న 'రామాయణ: పార్ట్ 1' చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో ఆమె రావణుడి సోదరి అయిన శూర్పణఖ పాత్రలో కనిపించనుంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ ఈ సినిమాలోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. శూర్పణఖ జీవితంలోని ఇంతకుముందు తెలియని కొన్ని కోణాలు ఈ పాత్ర చేయటం ద్వారా తెలుసుకున్నాను. ఆమె గురించి నాకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. నేను ఈ స్క్రిప్ట్ చదివినప్పుడు, లక్ష్మణుడు ఆమె ముక్కును కోసిన సంఘటన కంటే ముందు, ఆ తర్వాత ఆమె జీవితం గురించి చాలా విషయాలు అందులో ఉన్నాయి. నేను ఈ పాత్ర చేయడం ద్వారా నాకు ఇవన్నీ ఆసక్తిగా అనిపించాయి. అందుకే నాకు ఈ పాత్ర చాలా బాగా నచ్చింది. శూర్పణఖ వ్యక్తిత్వంలోని విభిన్న కోణాలకు నేను ఆకర్షితురాలినయ్యాను. లంకలో ఆమెను అత్యంత అందమైన మహిళ అని అనేవారు. ఆమెకు అహం ఉండేది. చరిత్ర తరచుగా ఆమెను ఒక భయంకరమైన ప్రతినాయకురాలిగా మాత్రమే గుర్తుంచుకున్నప్పటికీ శూర్పణఖలోని సహజసిద్ధమైన సంక్లిష్టతే నేను ఈ పాత్రను పోషించేలా చేసిందంటూ చెప్పుకొచ్చింది.



Editor, Publisher Printer & Owner : MITIKELA URUKUNDU, PLOT NO.37, NEAR MS.9, RK VILLAS, PASUPULA ROAD, PASUPULA POST, KURNOOL, ANDHRA PRADESH - 518002.
Printed at : M K PUBLICATION AND OFFSET PRINTERS 86/297/5, MAHA LAKSHMI NAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518002., Regd: RNI No.APTEL/25/A0055